"టీ పార్టీ" ★

శ్రీ సోమంచి రామం

"అమ్మా! డాక్టరుగారింట్లో టీపార్టీకి నేకూడ వెళ్ళొద్దుటే" అంటూ స్కూలునుంచి పరుగెత్తుకునివచ్చి పైనబడ్డ పదేళ్ళ గోపీకి ఏం సమాధానం చెప్పాలో తెలియక తబ్బిబ్బైపోయిందా తల్లి. తన భర్త పనిచేసే కంపెనీలో ఆఫీసర్లు టీపార్టీ చేసుకొంటారని మాత్రం ఆమెకు తెలుసు!- అదేనా తన భర్త చెప్పబట్టి! అలాటి ఆఫీసర్లు చేసికొనే టీపార్టీకి పదేళ్ళ గోపీ, అందులోనూ తనలాటి బీదదాని కడుపున పుట్టిన దురదృష్టపు గోపీ వెడతానంటే ఆ తల్లికి అయోమయంగా తయారయిందంతా! టీపార్టీ అంటే ఏవేవో మంచి మంచి విలువైన తిను బండారాలు తింటారని అప్పుడప్పుడు తన భర్త చెప్పేవాడు. అలా చెప్తుంటే తమ కాభాగ్యం లేకపోయిందే అని విచారించేది. అలాంటిదిప్పుడు తన కొడుకు టీపార్టీకి వెడతానంటే ఎలా పంపడమో సమస్యగ పరిణమించిం దామాతృహృదయానికి.

"ఏమ్మే! అమ్మా! మాట్లాడవేమే!"- అంటూ తిరిగి గోపీ ప్రశ్నించగానే "అలాగేలే నాయనా! అలాగే వెడుదువుగానిలే!" అంది అప్రయత్నంగా! అన్నదేకాని ఎలా పంపడమో, ఎక్కడికి పంపడమో, అసలు ఎక్కడ టీపార్టీయో ఎందుకు టీపార్టీయో ఇవన్నీ తెలియవా తల్లికి.

"గోపీ!" అని పిలిచిందామె! ఆనందంతో పరుగిడుతున్న గోపీ అలా ఆగిపోయాడు. "ఇలా రా! నాయనా! అసలు టీపార్టీ యెక్కడమ్మా!" అని ఎంతో ప్రేమతో ప్రశ్నించింది. తల్లి తనపక్షమేనని గ్రహించిన ఆ పసిహృదయానికి ఉబలాట మెక్కువయింది. "కాలవదగ్గర డాక్టరుగారింట్లోనమ్మా! వాళ్ళబ్బాయి మురళీ నేను ఒకటే క్లాసు. మురళి పుట్టినరోజమ్మా — మురళి నన్ను మరీ మరీ రమ్మని చెప్పాడు. మురళికి నేనంటే ఎంతో యిష్టమమ్మా!" అంటూ గుక్క తిరక్కుండా చెప్పేస్తున్నాడు.

"డాక్టరుగారింటికా! వద్దు నాయనా! వద్దు" అందామె! "ఎందుకొద్దమ్మా?" అన్నాడేడుస్తూ గోపీ! అతని ఆనందమంతా వద్దు అన్న యీ ఒక్క మాటతో నాశనమయింది. అతని ఆశలన్నీ అడుగంటిపోయాయి.

"మనం బీదవాళ్ళం! గొప్పవాళ్ళింటికి బీదవాళ్ళు వెళ్ళకూడదు నాయనా!" అంది గొప్ప బీదల తారతమ్యం తెలిసిన ఆ తల్లి. కాని యిదేమీ గోపీకి నచ్చలేదు. వాళ్ళు గొప్పవాళ్ళేమిటి? తను బీదవాడేమిటి? "అమ్మా! మరి వాళ్ళ మురళి పిలిచాడుకదే! పిలిస్తే ఎందుకెళ్ళకూడదు?" అన్నాడు సందేహం తీరక! "మురళి చిన్నపిల్లవాడు కదూ! అందుకని — చిన్న పిల్లలు పిలిస్తే వెళ్ళకూడదమ్మా!" అని సర్దబోయింది. "మరయితే ఎవరు పిలిస్తే వెళ్ళాలమ్మా!" అని ఎదురు ప్రశ్న వేశాడు గోపీ! "పెద్దవాళ్ళు పిలవాలి నాయనా! డాక్టరుగారే పిలవాలి! ఆయన పిలిస్తేనే వెళ్ళాలి!" అంది. "మరి పుట్టినరోజు మురళిదైతే ఆయనెందుకమ్మా పిలవడం! మురళే పిలవాలిగా!" అన్నాడు ఎలాగైనా తల్లిని ఒప్పించాలని! "చిన్న పిల్లలకు ఏమి తెలియదు నాయనా!" అని యింకా యేమేమో అనబోయింది. "అమ్మా! అమ్మా! అయితే నా పుట్టినరోజుక్కూడ నాన్నను టీపార్టీ చెయ్యమనవే!" అన్నాడు గారాబంగా! కొడుకు పుట్టినరోజు పండగ మాటెత్తేసరికి ఆ మాతృహృదయం మధనపడింది క్షణంసేపు. గోపీ పుట్టినరోజు రెండు మూడు రోజుల క్రితమే గడిచిపోయింది ఆనాడు బియ్యంలేక తల్లితండ్రులిద్దరూ వస్తుండి కొడుక్కి కాస్తగంజికాచిపోశారు. "అలాగేలే!" అని లేవబోయింది కొడుకు యిప్పటి టీపార్టీమాట మర్చిపోయాడనుకుని. "మరయితే యివాళ.....!" అంటూ చీరకొంగు పట్టుకుని అడిగాడు. కొడుకుని చూసేసరికి జాలివేసింది. "సరేలే!" అని మాత్రం అనగలిగింది. "అమ్మా! నువ్వు చాల మంచిదానివే!" అన్నాడు గోపీ అమాయకంగా!

కొడుకును టీపార్టీకి పంపుతానందేకాని ఏ బట్టలు తొడిగించాలో, ఎలా పంపాలో అర్థం కావడంలేదు. వాళ్ళు చూస్తే సిల్కు చొక్కాలు తొడుగుతారు! తన కొడుక్కి చూస్తే చిరుగుల చొక్కాలు! గోపీ అన్నం తిని చెయ్యి కడుక్కుని బయటకొచ్చేసరికి తండ్రి వచ్చాడు కంపెనీనుంచి. "నాన్నా! నాన్నా! నే టీ పార్టీ కెడుతున్నా" నంటూ మీదపడ్డాడు గోపీ! సంతోషం పట్టలేక

గోపీని చంకనెత్తుకుని "ఎక్కడ నాయనా!" అన్నాడా తండ్రి! "మాబళ్ళో మురళి పుట్టినరోజు నాన్నా! మురళి తెలుగవూ! డాక్టరుగారి అబ్బాయి! నన్ను తప్పకుండా రమ్మన్నాడు" అంటూ చెప్పుకుపోతున్నాడు ఆనందపరవశత్వంతో!

"అమ్మా! అమ్మా! తలదువ్వవే! అప్పుడే నాన్నొచ్చేశాడు! ఒంటి గంటయిపోయింది. మూడింటికే టీపార్టీ! నువ్వేపనీ సరిగ్గా చెయ్యవే!" అన్నాడు గోపీ. "పంపుతానన్న దానివి మరి ముస్తాబు చెయ్యవేం?" అన్నాడు భర్త. ముస్తాబంటే ఏం చెయ్యాలనో! అయినా ఏమున్నాయని ముస్తాబు చెయ్యడానికి! మంచి మంచి గుడ్డలా ఏమన్నానా? ఇక ఎలాగూ తప్పదని ఉతికినవే చిరిగినచోట కుట్టి, శుభ్రంగా నీళ్ళుపోసి తలదువ్వి, తొడిగింది. గోపీ ఆనందానికి అంతులేదు. తనుకూడ టీపార్టీకెడుతున్నాడు. అక్కడస్కూలు పిల్లలందర్నీ కలుసుకుంటాడు. అంతా కలిసి గంతులేస్తారు. మేష్టారు కూడ వస్తారు. ఇవాళ ఎంచక్క పాఠాలు అడగరు. మురళి ప్రక్కనే కూర్చుంటాడు తను. కావలసినన్ని లడ్డూలు అవి తినొచ్చునని చెప్పాడు మురళి. తన కడుపు నిండినన్ని తిని మురళి నడిగి కొన్ని అమ్మకు నాన్నకుకూడ తేవచ్చు. యింకా...యింకా...ఇలాంటివెన్నో ఆలోచనలతో నిండిపోయిందా చిన్ని బుర్ర.... "నాన్నా! నువ్వు కూడా రా! నాన్నా!" కాని నాన్నేడి? అప్పటికే వెళ్ళిపోయాడు కంపెనీకి! "అప్పుడే రెండయిందమ్మా— అయితే యింకొక గంటన్నమాట!" అన్నాడానందంతో! గంటలో పిండివంటలన్నీ తింటానుకదా అని ఉవ్విళ్ళూరుతున్నాడా పసికందు. "ఈసారి మానెయ్యి గోపీ! గొప్పవాళ్ళతో మనకు పొత్తు కుదురదు" అని చెప్పి చూసింది. కాని గోపీ ఆ మాటల్ని పెడచెవిని పెట్టాడు. ఆతల్లి యికచెప్పలేక పనిచూసుకొందుకు వెళ్ళిపోయింది. గోపీ పుస్తకాలన్నీ సర్దుకున్నాడు. తన పలకా పుస్తకాలు అన్నీ జాగ్రతగ ఒకచోట దాచుకున్నాడు. క్రాపు చెరిగిపోయిందేమోనని మళ్ళీ దువ్వుకున్నాడు. అద్దమ్ముక్కలో తనముఖం చూచుకుని మురిసిపోయాడు. మురళీకన్న తానే అందంగా ఉన్నాడని ఆనందంతో పొంగిపోయాడు. తన పుట్టిన రోజుకూడ అమ్మ టీపార్టీ చేస్తుంది! తనుకూడ మురళిని పిలుస్తాడు. మురళికూడ తనలాగే ముస్తాబై చక్కగా వస్తాడు! అమ్మ అన్నిరకాల పిండివంటలు అంటే — జంతికలు, చేగోడీలు, గార్లు చేస్తుంది. ఇలా ఏవేవో ఊహించుకుంటూ బయలుదేరాడు మురళి యింటికి! "అమ్మా! నే వెళ్ళిపోతున్నా! తలుపేసుకో!" అంటూ పరుగెత్తాడు. "జాగ్రత నాయనా! బళ్ళు అవీ...." అంటూ యింకా ఏమో చెప్పబోయింది. కాని గోపీ అప్పటికే చాలదూరం సాగిపోయాడు.

2

ఆహ్వానాల నంగీకరించి విచ్చేసిన అతిధులతో నిండిపోయింది డాక్టరుగారి బంగాళా! బంగాళా ముందు వరుసలో నిలబడ్డాయి కార్లన్నీ. బంగాళాముందు ఖాళీ స్థలంలో మంచి మంచి పూల మొక్కలు, క్రోటనులు. కంటికి ఇంపుగా పెంచారు. వచ్చేవాళ్ళు ఆ మొక్కల అందాన్ని తిలకించనిదే లోనికి వెళ్ళడంలేదు. లోపల పెద్ద హాలు. హాలునిండా లెక్కలేనన్ని కుర్చీలు. సోఫాలున్నా. పైన పంకాలు. హాలుమధ్య పెద్ద కుర్చీ వేశారు. ఆకుర్చీ కెన్నో అలంకారాలు చేశారు. అప్పుడే చాలా మంది వచ్చి ముందు కుర్చీల్లో కూర్చున్నారు. వచ్చే అతిధులందర్నీ స్వయంగా ఆహ్వానించి డాక్టరుగారు కరస్పర్శలు చేస్తున్నారు. కాని డాక్టరుగారు మాత్రం ఎవరికోసమో వెతుకుతున్నట్లు కనిపిస్తున్నారు. ఎవరికోసమో ఎవరికీ తెలియడంలేదు. టీ పార్టీ కన్నీ సిద్ధం చేయబడ్డాయి. అందరూ ఎప్పుడు ఆరగిద్దామా అని ఆదుర్దాగా ఎదురుచూస్తున్నారు. డాక్టరుగారు మాత్రం హడావిడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఆ బంట్రోతు నొకసారి, యీ నౌకరు నొకసారి కేకలేస్తున్నారు. పిలిచి చెవిలో ఏదో చెప్తున్నారు. వాళ్ళు ఖంగారుగా పరుగెడుతున్నారు. వచ్చిన ఆడవాళ్ళందర్నీ ఆదరించడంలో నిమగ్నురాలయింది డాక్టరుగారి భార్య.

ఇంతకూ ఎవరికోసమైతే యీ పార్టీ ఏర్పాటు చేశారో ఆ ముద్దుల మురళి కనపడటంలేదు. అసలు యింట్లో ఉంటేగా కనపడడానికి. గదులన్నీ గాలించారు. దొడ్లో వెతికారు. ఎక్కడా కనపడలేదు. తల్లి ముస్తాబు చేసి హాల్లోకి పంపింది. ఇంతలోనే ఎక్కడికి మాయమయ్యాడో కదా! డాక్టరుగారికి ఆత్రమెక్కువయింది. కంగారుగా బయటి కొచ్చాడు. వచ్చిన వాళ్ళలో గుసగుసలు బయలుదేరాయి. వాళ్ళకేం! ఇంతలో బయట గేటు దగ్గర ప్రత్యక్షమయాడు మురళి గోపీతోసహా.

డాక్టరు గారికి ఏం చెయ్యాలో తోచలేదు. ఆమురికి ముష్టి వెధవని వెంటబెట్టుకొచ్చాడని మురళిపై కోపం వచ్చింది. కాని సమయానికి కనిపించాడని సంతోషించారు. ఆ సంతోషంలో యీ కోపం మర్చిపోయారు. గబగబ పోయి మురళి నెత్తుకుని వచ్చారు. గోపీకి ఏం చెయ్యాలో తోచలేదు. మురళి చూడ్డానికి చాల ముచ్చటగా ఉన్నాడు. వులెను సూటు కుట్టించారు డాక్టరుగారు. ఆ సూటులో నిజంగా డాక్టరులాగే ఉన్నాడు మురళి. మురళిని తీసికొచ్చి హాలుమధ్య కుర్చీలో కూర్చోబెట్టారు. అతిథుల్లో కొందరు ఫొటోలు తీశారు వచ్చిన వాళ్ళంతా తెచ్చిన కానుకలన్నీ బహూకరించారు.

తన మేష్టారు, పిల్లలు అంతా వస్తారు. అంతా కలిసి ఆడుకోవచ్చునని ఎంతో అనుకున్న గోపీకి యిదంతా వింతగా తోచింది. తన మేష్టారు లేరు. పిల్లలు లేరు. ఏంచెయ్యాలో తెలియలేదు. అంతా తింటూంటే తనకూ నోరూరింది. గేటు లోపలకి వచ్చేడన్న మాటేగాని హాలు దగ్గర గుమ్మం దాటలేకపోయాడు. అక్కడే దిగాలుపడి నుంచుని చూస్తున్నాడు తాను మురళి ప్రక్కన కూర్చుంటాడని భ్రమించాడు. కాని మురళి యిపుడు మాట్లాడే పరిస్థితిలో లేడు. ఇంతలో డాక్టరుగారు ఏదో పనుండి లోపలి కెళ్ళారు. "ఏయ్! యిక్కడున్నావేం? ఫో! బయటకు ఫో!" అంటూ మెడపట్టుకు గెంటా డొక నౌకరు గోపీని. దాంతో అందరు ఆహ్లాదంతో వెకిలిగ నవ్వారు తామేదో పెటి పుట్టినట్టు. ఈమాటలు మురళికి వినిపించాయి. వెంటనే లేచివెళ్ళి గోపీని తీసుకొచ్చి ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు.

తనతో తినమన్నాడు. అతిథులందరూ ఆశ్చర్యపోయారు. ఈసారి మరింత వెకిలిగ నవ్వారు. మరింత గోలయింది. గోపీ బిత్తరపోయాడు. భయం కల్గిందా పసి కందుకు. ఎందు కొచ్చానా అనిపించింది. టీ పార్టీ అంటే ఎన్నో తినవచ్చు ననుకున్నాడు. కాని ఇప్పు డివన్నీ కంటికి భయంకరంగా కనిపిస్తున్నాయి. "భయపడతావేం! గోపీ! తిను" అంటూ ప్రోత్సహించిన మురళి మాటలతో గోపీ ఒక లడ్డూ తీసికొని నోట్లో పెట్టుకో బోయాడు. ఇంతలో డాక్టరుగారొచ్చారు. మురళి ప్రక్కన గోపీని చూచి ముక్కుమీద వేలేసికొన్నారు తన కొంపేదో మునిగి పోయినట్టు! ఈ సారి డాక్టరు ఉద్రేకపూరితులయ్యారు. ఆవేశం పట్టలేక గోపీని లాగి క్రిందకు పడతోశారు. "ముష్టి వెధవా! మా వాడిని పాడుచేద్దామని వచ్చావా?" అంటూ నౌకరును పిలిచి బయటకు గెంటేయ్యమన్నాడు. గోపీ చేతిలోని లడ్డూ క్రిందపడి ముక్కలై పోయింది. మురళి మాత్రం బిక్క మొహంతో "నాన్నా! గోపీని పిలవ్వా!" అన్నాడు ప్రాధేయపూర్వకంగా. "తప్పమ్మా! అలాంటి వాళ్ళతో మాట్లాడకూడదు! ముష్టి వెధవ! వాడితో యీ రోజు నుంచి మాట్లాడకు!" అన్నాడు కాని మురళి మాత్రం యీ మాటలతో ఊరుకోలేదు. గబగబ లేచి పోయాడు. తండ్రి అడ్డు వెళ్ళి వెనక్కి తీసికొచ్చాడు. గోపీని నౌకరు "ఫో! వెధవా!" అంటూ గేటులోంచి ఒక్క తోపు రోడ్డు మీదకు తోసిగేటు వేశాడు.

గోపీ కాళ్ళీడ్చుకుంటూ చేరుకున్నాడు యిల్లు. తల్లి కొడుకుని చూచి బావురుమంది. తల్లిని కావిలించుకున్నాడు. ఒళ్ళోకి తీసుకొని లోనికెళ్ళి మంచంమీద పడుకో బెట్టిందాతల్లి.

3

"ఇంకే టీపార్టీకి వెళ్ళనమ్మా!" అంటూ బావురుమన్నాడు తల్లిని చూసి. తల్లి కేం అర్థం కాలేదు. "ఏం నాయనా! ఏం జరిగింది?" అంటూ ఆత్రంగా అడిగింది. "ఇంకే టీపార్టీకి వెళ్ళనమ్మా!" అన్నాడు మళ్ళీ ఏడుస్తూ. ఇంతలో కంపెనీనుంచి తండ్రి వచ్చాడు. తల్లి దండ్రు లిద్దరూ దిగాలు పడి మంచందగ్గర కూర్చున్నారు ఇంతకూ ఏం జరిగిందో వాళ్ళకు తెలియనేలేదు.

"ఏం జరిగింది గోపీ?" మెల్లగా బుజ్జగిస్తూ అడిగాడు తండ్రి.

"అక్కడ కొట్టారు నాన్నా! ఇంకే టీపార్టీకి వెళ్ళనులే! అమ్మా!" అంటూ మెల్లిగా చెప్పాడు.